యూనిక్ ఐడీతో బహుళ ప్రయోజనాలు

- రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- వ్యవసాయానికి ఎంతో కీలకం
- సొంత భూమి ఉన్న రైతులే అర్హులు
- రైతు సేవా కేంద్రాల్లో జోరుగా నమోదు ప్రక్రియ


ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్

నల్లజర్ల: భూమి ఉన్న అన్నదాతలకు ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. భవిష్యత్తులో వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది.

27 వేల ఎకరాల్లో సాగు

నల్లజర్ల మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరి, చెరకు, మొక్కజొన్న, అరటి వంటి పంటలు 15 వేల ఎకరాల్లోనూ, ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో వంటి పంటలు 12 వేల ఎకరాల్లోనూ సాగవుతున్నాయి. మొత్తం 27వేల ఎకరాలలో 10,589 మంది సొంత భూమి ఉన్న రైతులు ఉన్నారు. వీరంతా విశిష్ట సంఖ్య పొందాల్సి ఉంది. సొంత భూమి ఉన్న రైతులంతా అధికారులు సూచించిన ధ్రువపత్రాలతో రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే ఐడీ నంబర్ నమోదు చేస్తారు.

అవసరమైన పత్రాలు..

విశిష్ట సంఖ్య నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, వన్–బీ, ఆధార్‌లింకైన మొబైల్ నంబర్ జెరాక్స్ కాపీలు తీసుకొని రైతు సేవాకేంద్రానికి వెళితే వ్యవసాయశాఖ సహాయకులు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతు ఆధార్ లింక్ మొబైల్ నంబర్‌కు మూడు సార్లు ఓటీపీ వస్తుంది. వాటిని ఎంటర్‌చేసి రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుంది.

విశిష్ట సంఖ్యతో ప్రయోజనాలు ఇలా..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి ఈ విశిష్ట సంఖ్య ఆధారం కానుంది. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలు, రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు, సూక్ష్మపోషకాలు, డ్రిప్ సౌకర్యం, పంట రుణాలు, పెట్టుబడి తదితర పథకాలను రైతులు నేరుగా పొందే వీలు కలుగుతుంది. పంట నష్ట పరిహారం సత్వరమే పొందడానికి, తెగుళ్ల నివారణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందవచ్చు.

ప్రతి రైతూ నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేయించుకుని విశిష్ట సంఖ్యను పొందాలి. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటివరకూ 2,900 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన నమోదు చేయించుకోవాలి.

కె.కమల్‌రాజ్.వ్యవసాయాధికారి, నల్లజర్ల

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లోని రైతులందరికీ విశిష్ట సంఖ్య నమోదు, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే చాలా మంది రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ధ్రువ పత్రాలు అందిస్తున్నారు. ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ విశిష్ట సంఖ్య ఎంతో అవసరం. పొలం ఉన్న ప్రతి రైతూ నమోదు చేయించుకోవాలి.

దుర్గా భవాని, రైతు సేవా కేంద్ర సిబ్బంది, అనంతపల్లి

కె.సావరంలో టీబీ రికార్డుల పరిశీలన


కె.సావరం గ్రామంలో రికార్డులు పరిశీలిస్తున్న వసుంధర, తదితరులు

ఉండ్రాజవరం: పీఎం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ టీం గురువారం కె.సావరం గ్రామాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా క్షయ, ఎయిడ్స్, లెప్రసీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర్, మెడికల్ కాలేజీకి చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ ఇప్పటివరకు టీబీ రహిత గ్రామాలుగా మండలంలో దమ్మెన్ను, కె.సావరం గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామాలు వివిధ మెడల్స్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. దానిలో భాగంగా కె.సావరం గ్రామంలో పరిశీలన చేపట్టినట్టు తెలిపారు. కె.సావరం గ్రామం 2023 సంవత్సరంలో బ్రాంజి మెడల్ సాధించగా, 2024లో సిల్వర్ మెడల్‌కు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా 2024వ సంవత్సరంలో నమోదు చేసిన టీబీ నిర్ధారణ పరీక్షలు, నమోదు చేయబడిన టీబీ రోగుల వివరాలు, క్షయ పోషణ యోజన, పోషకాహార కిట్లు, 2023 సంవత్సరం అవుట్ కంలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నార్ని రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.ఉషాదేవి, ఎస్‌టీఎస్ ఆశాజ్యోతి, కార్యదర్శి పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.శ్రీదేవి గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మండలంలో ముద్రగడ పర్యటన


అన్నదేవరపేటలో వైఎస్సార్ సీపీ నాయకులతో ముద్రగడ పద్మనాభం

తాళ్లపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం గురువారం తాళ్లపూడి మండలంలో పర్యటించారు. గ్రామాల్లో జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అన్నదేవరపేటకు చెందిన తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం మాజీ వైస్ ప్రెసిడెంట్ పప్పుప్పుల నాని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, నూతంగి సురేష్, వల్లభ శెట్టి శ్రీను, రాజు, రసూల్, వల్లభ శెట్టి చిన్ని, వనిమిరెడ్డి శ్రీను తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

గోపాలపురం: ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేస్తున్నట్లు ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గోపాలపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి పి.భాగ్యవతి అన్నారు. గురువారం గోపాలపురంలోని ఆమె స్థానిక పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బూత్‌ల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బీఎల్‌ఓ, వీఆర్వో, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈమె వెంట డీటీ కె.లక్ష్మీ దేవి, సీనియర్ అసిస్టెంట్ కాత్రు నల్లరాజు సిబ్బంది ఉన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతీ

కొవ్వూరు: ప్రపంచ సామాజిక న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతీ మాట్లాడుతూ న్యాయం అందరికీ సమానంగా అందాలన్నారు. అప్పుడే న్యాయం, చట్టాలపై నమ్మకం పెరుగుతుందన్నారు. సమాజంలోని అసమానతలను న్యాయంతో జయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు .


శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చాగల్లు: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీస్కూల్ నిర్వహణ, యాక్టివేషన్, పీపీ-1, పీపీ-2 విద్యాబోధనపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సుభాకర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీ స్కూల్ నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ చాగల్లు, మార్కొండపాడు సెక్టార్ల సూపర్‌వైజర్లు శిరిష, పద్మావతి, విద్యాశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కూటమి హామీ చిత్తు కాగితంతో సమానం

నిడదవోలు రూరల్: రాష్ట్రాన్ని పాలించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామంలో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్‌కు మద్దతుగా గురువారం ఓట్లు అభ్యర్థించారు.హర్షకుమార్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల హామీ పత్రం చిత్తుకాగితంతో సమానమన్నారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేసే సుందర్‌ను పట్టభద్రులందరూ గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ నేత హుస్సేన్ మృతి


షేక్ హుస్సేన్ జహ(ఫైల్)

నిడదవోలు : పట్టణ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ హుస్సేన్ జహ(67) గురువారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడవరపు భద్రందొర కుటుంబ సభ్యులను కలుసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీవీవీ సత్యనారాయణ, షేక్ చినజిలాని, మహ్మద్ జమీర్ రహ్మాన్, చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, మహ్మద్ అన్వర్‌ఖాన్, భావన రమేష్, పుచ్చకాయల వరప్రసాద్, షేక్ కాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరన్నబాబు సంబరం

- ఘనంగా స్వామివారి గ్రామోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


వేగేశ్వరపురంలో గోదావరి వద్ద వీభూతి పళ్లకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో వీరన్నబాబు సంబరం (సేవ) గురువారం వైభవంగా జరిగింది. వీరన్న బాబు గద్దె పునఃప్రతిష్ఠలో భాగంగా గ్రామస్తులు, మహిళలు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నూతన ఆలయంలో విభూది పళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీభూది పళ్లను వీరులుగా భావిస్తూ పూజలు చేశారు. అనంతరం విభూది పళ్లను తలపై పెట్టుకుని వీరన్నబాబు గద్దెలో ప్రతిష్ఠించారు. వీరభద్రుని వేషధారులు శూలాలతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగనృత్యాలు, కోలాటం ఆటకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన నాలుగు వేల మంది భక్తులు పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వీరన్నబాబు సంబరంలో పాల్గొన్నారు. కాగా గ్రామంలోని వీరన్నబాబు గద్దెకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని పండితులు తెలిపారు.

విద్యుత్ సరాఫరాకు నేడు అంతరాయం

ఉండ్రాజవరం: చెట్ల కొమ్మల కటింగ్ పనుల నిమిత్తం స్థానిక ఉండ్రాజవరం సబ్‌స్టేషన్ పరిధిలో సత్యవాడ ఫీడర్‌లో ఉండ్రాజవరం, సత్యవాడ గ్రామాల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని కోరుమామిడి, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

చాగల్లు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నెలటూరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వసుంధర సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నెలటూరు గ్రామ పంచాయతీ గత సంవత్సరం బ్రౌన్ జోన్, ఈ సంవత్సరం సిల్వర్ జోన్‌గా ఎన్నికైందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చాగల్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తనుజా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) టీమ్ సభ్యులు, టీబీ సూపర్‌వైజర్ పోతురాజు హెచ్‌వీ ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ పీవీ సత్యనారాయణ, ఎంఎల్ హెచ్ పి.పూర్ణిమ, ఏఎన్‌ఎం దేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్


పాఠశాలకు ఆర్‌ఓప్లాంట్, బెంచీలు, టేబుల్స్ అందించిన ఐఓబీఐ బ్యాంక్ అధికారులు

పెరవలి: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా రూ.55 వేలు విలువ కలిగిన వస్తువులను ఐఓబీఐ బ్యాంకు తరపున అందిస్తున్నామని ఆ బ్యాంక్ మేనేజర్ నూక కార్తీక్ తెలిపారు. కానూరు నెం.3 పాఠశాలకు ఉండ్రాజవరం మండలం పాలంగి ఐఓబీఐ బ్యాంక్ ఆర్థిక సాయంతో ఆర్‌ఓ ప్లాంట్, కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు, బెంచీలు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు, ప్రజల ఉపయోగం అనేక కార్యక్రమాలు చేపడతామని అందులో భాగంగా ఈ ఏడాది ఈ పాఠశాలకు వీటిని సమకూర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది చుండ్రు రమేష్, కప్పల అశోక్, కె.కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకట రాముడు, నాగమణి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

మాజీ ఎంపీ హర్షకుమార్


ఓట్లు అభ్యర్థిస్తున్న హర్షకుమార్

గోపాలపురం: అన్ని రంగాల్లోనూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. గోపాలపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి, చట్టసభల్లో ప్రతిపక్షాల గొంతు వినిపించకూడదన్న కక్షపూరిత వాతావరణంలో వ్యవహరిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇటీవల గుంటూరు మిర్చి మార్కెట్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లే వరకూ కేంద్రానికి కనీసం లేఖ కూడా రాయలేని పరిస్థితిలో చంద్రబాబు పాలన ఉందన్నారు. కూటమి మేనిఫెస్టో చిత్తు కాగితంతో సమానమని నిరూపించిన కూటమి ప్రభుత్వ పనితీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తనయుడు జీవీ సుందర్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు.

న్యాయవాదుల ధర్నా


కోర్టు ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

నిడదవోలు : నిడదవోలు అఖిల భారత ప్రగతిశీల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద న్యాయవాదుల బిల్లు 2025 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అఖిల భారత ప్రగతిశీల న్యాయవాదుల సంఘం నేషనల్ కన్వీనర్ నంబూరి. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తికి సంకెళ్లు వేసే న్యాయవాదుల బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు వృత్తి భద్రత, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మత్తి అర్జునుడు, సీహెచ్ విజయకుమార్, నక్క వెంకటేశ్వర్లు, పంతగాని సురేష్‌బాబు, చేపల సుబ్బారావు, పి. సుబ్రహ్మణ్యం, పేరూరి సాయిబాబా, ఎల్లె బుజ్జిబాబు, జేమీల, ఉదయగి, రవి తదితరులు పాల్గొన్నారు.

26న వాహనాల వేలం

కొవ్వూరు: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుబడిన మోటారు వాహనాలకు ఈ నెల 26న వేలం నిర్వహించనున్నట్టు కొవ్వూరు ఎక్సైజ్ స్టేషన్ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు కొవ్వూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వాహనాలు పాడుకున్న వ్యక్తులు అదే రోజు వేలం సొమ్ముతోపాటు 18 శాతం జీఎస్‌టీ చెల్లించాలని సూచించారు.

పన్నుల వసూలులో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

నిడదవోలు రూరల్: ఈ నెల 30వ తేదీలోపు ఆయా గ్రామాల్లో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలోని 15వ ఆర్థిక నిధులతో కలెక్టర్ ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, టి.గోపాలకృష్ణ, కేవీ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు 4,440 క్యూసెక్కుల నీరు విడుదల

నిడదవోలు : విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు గత వారంరోజులుగా 4,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి పశ్చిమడెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవరనుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. గోదావరి నదిలో ఆశించిన స్థాయిలో జలాలు లేకపోవడంతో అధికారులు సీలేరు జలాశయం నుంచి 7071 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 1700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1567 క్యూసెక్కులు విడుదల చేయగా ఏలూరు కాలువలకు 838, తణుకు కాలువకు 1150, అత్తిలి కాలువలకు 406 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రైతులను అభినందించిన జర్మనీ బృందం


పల్లంట్లలో ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేస్తున్న మిరపతోటను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

దేవరపల్లి: మన దేశంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకుని వారి దేశంలో అమలు చేయడానికి జర్మనీకి చెందిన పలు ఆర్గనైజేషన్ల ప్రతినిధుల బృందం గురువారం దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పలువురు రైతులను బృందంలోని ప్రతినిధులు అభినందించారు. యర్నగూడెంలో ఆదర్శ రైతు గద్దే మునేశ్వరరావు ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న దేశీయ వరి పంటను పరిశీలించారు. అనంతరం డ్రోన్ స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. పల్లంట్లలో మహిళ చాపల సత్యవతి ఎకరం భూమిని కౌలుకు తీసుకుని పండిస్తున్న ఆకు కూరలు, కాయకూరలు, కోకో, మిరప పంటలను బృందం పరిశీలించి మహిళలను అభినందించారు. రైతు కిషోర్ ఐదెకరాల్లో సాగు చేస్తున్న మిరప పంటను బృందం పరిశీలించింది. అక్కడ నుంచి కురుకూరులో జుజ్జవరపు సతీష్ కొబ్బరిలో సాగు చేస్తున్న బహుళ అంతర పంటలు, కోకో, వక్క, వివిధ రకాల పంటలను బృందం పరిశీలించింది. ఇక్కడ రైతులు అవలంబిస్తున్న వ్యవసాయ పద్ధతులను బృందం ప్రతినిధులు రైతులను అడిగి తెలుసుకున్నారు. జర్మనీలో సైతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని.. అర ఎకరంలో బహుళ పంటలు సాగు చేస్తున్నట్టు బృందం తెలిపింది. ఇంకా మెరుగైన ఉత్పత్తులు సాధించడానికి, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలో పర్యటిస్తున్నట్టు బృంద ప్రతినిధులు తెలిపారు. బృందంలో జాస్పర్ జోర్డాన్, బెనెడిక్‌ట్ హెర్లిన్, డియోగో కౌటిన్హో, లుకాస్ కెప్లర్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీపీఎం వల్లీ, ఆర్‌ఓహెచ్‌ఎస్ ప్రకాష్, శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలి


కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు

ఉండ్రాజవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవోలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్న అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడోరోజు గురువారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో సీడీపీవో శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎం.భాగ్యలక్ష్మి, ఎం.సరస్వతి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరిగితే సమాచారమివ్వండి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్సై పరమహంస

నిడదవోలు: పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని పట్టణ ఎస్సై జీఎస్ఆర్‌కే పరమహంస సూచించారు. పట్టణంలో 14వ వార్డులో గురువారం ఆయన లాక్డ్ హౌసెస్, అసాంఘిక కార్యాకలాలపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై పరమహంస మాట్లాడుతూ ఇంటి యజమానులు తమ ఇళ్లకు తాళం వేసి వేరే ఊళ్లకు వెళ్లినప్పుడు నేరస్తులు ముందుగా రెక్కి నిర్వహించి చోరీలకు పాల్పడతారన్నారు. ఆయా వార్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటి తాళం పగలగొట్టి చోరీలు చేయు విధానంపై అవగాహన కల్పించారు.